ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం: 33.0 | కనిష్ఠం: 19.0

ANDHRAJYOTHY 5 **వనపర్తి** జిల్లా వార్తలు

సోమవారం 15 జనవరి 2024



వనపర్తి జిల్లా పెబ్బేరులో గంగిరెద్దు విన్యాసం



మహబూబ్‌నగర్‌లోని పద్మావతి కాలనీలో భోగి వేడుకల్లో పాల్గొన్న కాలనీవాసులు

నేడు సంక్రాంతి

» భోగి పండుగను ఘనంగా జరుపుకున్న ఉమ్మడి జిల్లా ప్రజలు

మూడు రోజుల సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని లోగిళ్లు కళకళలాడుతున్నాయి. బంధుమిత్రుల రాకతో సందడిగా మారాయి. గంగిరెద్దుల విన్యాసాలు, డూడూ బసవన్నల విన్యాసాలు, ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులతో కొత్త శోభ సంతరించుకుంది. ప్రజలు ఆదివారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున భోగి మంటలు పెట్టి, పాత వస్తువులను అందులో కాల్చేశారు. ఇళ్ల ముందు ముగ్గులు వేశారు. సోమవారం సంక్రాంతిని, మంగళవారం కనుమ పండుగను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా రంగులు, గాలిపటాల విక్రయాల షాపులు రద్దీగా మారాయి.

- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



గద్వాలలో ముగ్గు వేస్తున్న మహిళలు



మక్తల్ శబరి కాలనీలో గంగిరెద్దుకు మొక్కుతున్న మహిళలు



మహబూబ్‌నగర్‌లో గంగిరెద్దు విన్యాసం



గద్వాలలో చిన్నారులపై భోగి పండ్లు పోస్తున్న మహిళలు



కొత్తకోట పట్టణంలో భోగి మంట వద్ద పట్టణవాసులు



నారాయణపేటలో ముగ్గు వేస్తున్న యువతి



ముగ్గులో దించేశారు..

» అయోధ్య రామాలయం, సీత, రామ, లక్ష్మణుడి చిత్రాలతో సంక్రాంతి ముగ్గు వేసిన మహిళలు

భోగి సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోని మహంకాళి వీధిలో.. గుత్తి కావ్య, కృష్ణవేణి వేసిన ముగ్గు ఆకట్టుకుంది. అయోధ్యలోని రామాలయం, సీత, రామ, లక్ష్మణులతో కూడిన ఆ ముగ్గును చూసిన పలువురు అభినందించారు. వారిని ఎస్పీ బాలు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి సత్కరించారు.

- నారాయణపేట

జన్‌మన్‌పై ఆశలు

» నేడు మన్ననూరు పీటీజీ గురుకులంలో ప్రధాన మంత్రి మోదీ వర్చువల్ మీటింగ్

» హాజరుకానున్న 800 మంది చెంచులు

» ఏర్పాట్లు చేసిన ఐటీడీఏ, డీటీడీవో అధికారులు



మన్ననూరు పీటీజీ గురుకులం వద్ద వర్చువల్ సమావేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీటీడీవో కమలాకర్ రెడ్డి

మన్ననూర్, జనవరి 14: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఎం జన్‌మన్ పథకం తమ జీవితాల్లో వెలుగులు నింపుతుందని నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని చెంచులు ఆశిస్తున్నారు. ఆదివాసి చెంచుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన ఈ పథకంపై జిల్లాలోని మన్ననూరు పీటీజీ గురుకులంలో ప్రధాని మోదీ సోమవారం మధ్యాహ్నం వర్చువల్ మీటింగ్ ద్వారా చెంచులతో మాట్లాడనున్నారు. 12 గంటల నుంచి 12:30 వరకు నిర్వహించే ఈ మీటింగ్‌లో కలెక్టర్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులుపాల్గొననున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి(డీటీడీవో) కమలాకర్ రెడ్డి, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్ మన్ననూరు గురుకులం వద్ద సమావేశ ప్రాంగణం ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. సమావేశానికి హాజరు కావాల్సిందిగా జిల్లా పరిధిలోని చెంచు సర్పంచులు, చెంచులు 800 మందికి ఆహ్వానం పంపారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణలను కూడా అధికారులు ఆహ్వానించారు. చెంచులను సమావేశానికి తీసుకొచ్చేందుకు ఐటీడీఏ ద్వారా వాహనాలను ఏర్పాటు చేశారు. సభకు హాజరయ్యే చెంచులకు భోజన వసతి కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశం ద్వారా పీఎం జన్‌మన్ పథకానికి సంబంధించి దేశవ్యాప్తంగా లక్ష మంది లబ్ధిదారులను మొదటి విడతగా ఎంపిక చేసి, పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ పథకంలో ముఖ్యంగా చెంచులకు ఆధార్, ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీ, బ్యాంకు ఖాతాలు తెరిపించడం, పాఠశాల భవనాలు నిర్మించడం, ఇళ్ల నిర్మాణం చేపట్టడం, పౌష్టికాహారం అందించడం, తాగునీటి వసతి, సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలకు శ్రీకారం చుట్టనున్నారు. వర్చువల్ సమావేశంలో చెంచులు తమ సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తెచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

చాలా సంతోషకరం



చెంచుల అభివృద్ధి కోసం పీఎం జన్‌మన్ కార్యక్రమాన్ని చేపట్టడం చాలా సంతోషకరం. నల్లమల చెంచులకు పక్కా గృహాలు నిర్మించాలి. రేషన్ కార్డులు ఇప్పించాలి. గతంలో శాసనసభ స్పీకర్ చెంచు పెంటలను సందర్శించారు. గవర్నర్ తమిళిసై సైతం అప్పాపూర్, రాంపూర్ పెంటలను దత్తత తీసుకొని పౌష్టికాహారం కోసం గిరిరాజ కోళ్లను పంపిణీ చేస్తున్నారు. చెంచు పెంటల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలి.


- దాసరి శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు

రోడ్డు సౌకర్యం కల్పించాలి



మారుమూలన ఉన్న మా పెంటలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. రేషన్ సరుకుల కోసం, ఆరోగ్యం బాగోలేకుంటే.. అప్పాపూర్, మన్ననూరులకు వెళ్లేందుకు ఆటోలను అద్దెకు తీసుకోవాల్సి వస్తోంది. అలా కాకుండా గ్రామాలకే వచ్చి రేషన్ సరుకులను నేరుగా అందించాలి. తమ పెంటలోనే సంచార వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేయాలి.

- నాగమణి, చెంచు మహిళ, ఈర్లపెంట



కార్పొరేట్ వైద్యం అందేలా చూడాలి

జన్‌మన్ పథకంలో చెంచులకు నిధులను కేటాయించడం హర్షణీయం. ప్రతీ ఒక్క చెంచు గిరిజనుడికి ఆయుష్మాన్ భారత్ కార్డు ఇచ్చి, వారికి కార్పొరేట్ వైద్యం అందేలా చూడాలి. అందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి. పెంటలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి. పథకంలో ఉన్న అభివృద్ధి పనులన్నీ అమలయ్యేలా అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలి.

- నిమ్మల శ్రీనివాసులు, ఆదివాసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ఆలయాన్ని శుద్ధి చేసిన డీకే అరుణ

» రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), జనవరి 14: దేశంలోని ఆలయాల పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు శ్రమదానం చేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆదివారం మహబూబ్‌నగర్‌లోని మర్లు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. ఆలయం లోపల, ప్రాంగణంలో నీటితో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో బాల రాముడికి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్నందున ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు చేపట్టి, నిత్య పూజలు చేయాలన్నారు. అంతకు ముందు పద్మావతి కాలనీలో తన ఇంటి వద్ద పార్టీ కార్యకర్తలతో కలిసి భోగి వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తరిగిపోని ధాన్యపు రాశులతో, తరలివచ్చే సిరి సంపదలతో దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్, కృష్ణయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొత్తకోట కిరణ్ కుమార్ రెడ్డి, నవీన్ రెడ్డి, వివిధ మోర్చాల కార్యకర్తలు పాల్గొన్నారు.



మర్లు పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాన్ని శుభ్రం చేస్తున్న డీకే అరుణ

మాజీ మంత్రుల పరామర్శ

» మాజీ ఎమ్మెల్యే ఆల సోదరుడి దశదినకర్మకు హాజరైన మాజీ మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

» పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లిలో హత్యకు గురైన పార్టీ కార్యకర్త కుటుంబానికి ఓదార్పు



ఆల కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి కేటీఆర్

భూత్పూర్, జనవరి 14: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి 10 రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందగా, ఆదివారం దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు హాజరయ్యారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్యేలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రాజేందర్‌రెడ్డి, పి.చంద్రశేఖర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు తదితరులు హాజరై శశివర్ధన్‌రెడ్డికి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేటీఆర్‌ను చూసి ఆల తల్లి వరలక్ష్మి, వదిన శ్రీలత, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు. వారిని కేటీఆర్ ఓదార్చారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మనోధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హత్యకు గురైన కార్యకర్త కుటుంబానికి పరామర్శ

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలో డిసెంబరు 29న కాంగ్రెస్ నాయకుల చేతిలో దారుణ హత్యకు గురైన బీఆర్‌ఎస్ కార్యకర్త, రిటైర్డు ఆర్మీ జవాన్ చిక్కపల్లి మల్లేష్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, డీఆర్ సంజయ్, ఎమ్మెల్సీ షఫీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు ఆదివారం పరామర్శించారు. మల్లేష్ చిత్ర పటానికి పూల మాల వేసి, నివాళులు అర్పించారు. మల్లేష్ భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్ని ఇచ్చారు. మల్లేష్ పిల్లల పూర్తి బాధ్యతను పార్టీ తీసుకుంటుందని అన్నారు. కేసీఆర్ ఈ ఘటనను తెలుసుకుని ఎంతో బాధపడ్డారన్నారు. మల్లేష్‌కు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని, కుటుంబానికి ధైర్యం చెప్పి పరామర్శించి రావాల్సిందిగా చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ తరఫున మల్లేష్ భార్య నిర్మలకు రూ.ఐదు లక్షల చెక్కును అందజేశారు. హతుని భార్య విద్యావంతురాలు కావడంతో ఆమెకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు రంగినేని అభిలాష్‌రావు, మండల అధ్యక్షుడు గణేష్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కట్ట రాజేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సింగారం వెంకటయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుజ్జుల పరమేష్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.



రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గురించి నాయకులతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రంగసముద్రాన్ని అభివృద్ధి చేస్తాం

» పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

శ్రీరంగాపూర్, జనవరి 14: రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన శ్రీరంగాపురంలోని రంగనాయక స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర శ్రీరంగంగా వెలసిన పుణ్య క్షేత్రానికి దేశం నలుమూలల నుంచి భక్తులు వచ్చేందుకు, పర్యాటకుల సందర్శన కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. చేయాల్సిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జడ్పీటీసీ ఎం.రాజేంద్ర ప్రసాద్ యాదవ్ మంత్రి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పదేళ్ల కిందట యూపీఏ కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.కోటీ 15 లక్షలతో నిర్మించిన టూరిజం భవనం నిరుపయోగంగా మారిందని తెలిపారు.

భీమా కాల్వ సామర్థ్యం పెంచాలి

భీమా ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి వచ్చే 15వ ప్యాకేజీ కాల్వను వెడలప్పు చేసి, రంగ సముద్రానికి నీరు వేగంగా వచ్చేందుకు ప్రతిపాదనలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కాల్వ కెపాసిటీ తక్కువగా ఉన్నందున 21 వేల ఎకరాలకు నీరు అందడం లేదన్నారు. అందుకే తాను రామన్‌పాడు నుంచి రంగసముద్రం వరకు ఉన్న భీమా కాలువను పరిశీలించానని, ఈ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. 16వ ప్యాకేజీలో డిస్ట్రిబ్యూటర్, మైనర్ కాలువలను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. 16వ ప్యాకేజీ గేట్లను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో భీమా ప్రాజెక్టు ఎస్ఈ సత్యశీలారెడ్డి, కొల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పాన్‌గల్: క్రీడలతోనే మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలను జూపల్లి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ ముంత భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మతిస్థిమితం లేని మహిళ

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 14 : మతిస్థిమితం లేని మహిళ కన్పించడం లేదని ఆమె తమ్ముడు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలోని ఎండబెట్లకు చెందిన మహిళకు వివాహమైనప్పటికీ భర్తతో విడాకులు తీసుకుని గ్రామం లోనే ఉంటుంది. గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి సంచరించేదని ఎస్‌ఐ తెలిపారు. ఎక్కడికైనా వెళ్తే నాలుగైదు రోజుల్లో తిరిగి ఇంటికి వచ్చే వారని తెలిపారు. డిసెంబరు 4వ తేదీన వెళ్లి ఇంతవరకు ఇంటికి రాకుండా కన్పించకుండా పోయిందని తప్పిపోయిన మహిళ తమ్ముడు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


కేతముళ్ల తిరుపతయ్య

మిడ్జిల్, జనవరి 14 : మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామానికి చెందిన కేతముళ్ల తిరుపతయ్య కనిపించడంలేదని తిరుపతయ్య అక్క మంజుల ఫిర్యాదు చేసినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు ఆదివారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. తిరుపతయ్య తన కూతురు పుట్టినరోజు కార్యక్రమానికి 12వ తేదీన రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం దత్తాయపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి మరుసటిరోజు 13వ తేదీన తన సోదరుడి కుమారుడి బైక్ తీసుకొని మసిగుండ్లపల్లి గ్రామానికి వెళుతున్నట్లు తన భార్యకు తిరుపతయ్య ఫోన్‌ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. తర్వాత తిరుపతయ్య ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో బంధువుల ఇళ్లు, తెలిసిన వారి ఇళ్లలో ఎంత వెతికినా తిరుపతయ్య ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం అదృశ్యమైన తిరుపతయ్య సోదరి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుత సంచారం..?

కృష్ణ, జనవరి 14 : నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని కున్సి గ్రామ శివారులోని జైన్ మందిరం పరిసర ప్రాంతంలో చిరుత కన్పించినట్లు కర్ణాటక రాష్ట్రం సైదాపురం గ్రామవాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచూరు నుంచి సైదాపూర్‌కు కారులో వెళ్తున్న సందర్భంగా చిరుత రోడ్డు పక్కన కనిపించి, పక్కన ఉన్న పత్తి చేనులోకి వెళ్లిందని అన్నారు. విషయమై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు వారన్నారు.

కల్లు దుకాణంపై దాడి

- బయటపడిన రాజకీయ వైషమ్యాలు


జమ్మిచేడులో కొత్త కల్లుదుకాణం వద్ద జరిగిన దాడిలో చెల్లాచెదురుగా పడిన బాటిళ్లు, బాక్కులు

గద్వాల, జనవరి 14 : పట్టణ సమీపంలోని జమ్మిచేడు గ్రామంలో కొత్తగా వెలసిన కల్లు దుకాణంపై గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం దాడి చేశారు. దుకాణాన్ని ధ్వంసం చేయడంతో ఇరువర్గాల మధ్య ఉన్న వైషమ్యాలు మరోసారి బయటపడ్డాయి. ఇంతకు పూర్వం ఉన్న సొసైటీ మూడేళ్లుగా కల్లు దుకాణం నిర్వహిస్తుండగా, సొసైటీలోని మెజార్టీ సభ్యు లు ఇటీవల కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్ర భుత్వం పడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో కాంగ్రెస్ మద్దతుదా రులు ప్రత్యేకంగా కొత్త కల్లు దుకాణాన్ని ప్రారంభించారు. దీనిని జీర్ణించుకోలేని పాత సొసైటీ వారే దాడులకు ఉసిగొలిపి ఉంటారని కొత్త దుకాణం నిర్వాహకులు ఆరోపిం చారు. దాడిలో స్థానికులు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు పాల్గొనడంతో తాము గుర్తించలేకపోయినట్లు బాధితులు తెలిపారు. అనంతరం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తాము ఫిర్యాదు చేశామన్నారు. కాగా, పాత దుకాణానికి మాత్రమే కల్లు దుకాణం నిర్వహణకు లైసెన్స్ ఉండగా, కొత్త దుకాణానికి ఎలాంటి లైసెన్స్ లేదని, అనధికారికంగానే దుకాణాన్ని ప్రారంభించారని తెలిసింది.


పది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో పోలీసులు

నారాయణపేట, జనవరి 14 : నారాయణపేట జిల్లా కేంద్రం సుభాష్‌రోడ్‌లోని ఓ నివాసంలో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హనుమంతు పరిసర ప్రాంత నివాసాల నుంచి పీడీఎస్ బియ్యం సేకరించి, నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఆ నివాసంపై దాడులు చేసి నిల్వ చేసిన పది క్వింటాళ్ల(20 సంచులు) పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం హనుమంతుపై కేసు నమోదు చేస్తామని ఎస్సై విజయ్ తెలిపారు.

మొబైల్ షాపులో చోరీ

- కేసు నమోదు


మొబైల్ షాపు డబ్బాకు వెనుక వైపు ఉన్న రంధ్రం

మిడ్జిల్, జనవరి 14 : మండల కేంద్రంలోని నరేష్ మొబైల్ షాపులో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఆదివారం షాపు యజమాని నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యదావిధిగా శనివారం రాత్రి 8.30 నిమిషాల సమయంలో షాపును బందుచేసి జడ్చర్లకు వెళ్లినట్లు తెలిపారు. రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపు వెనుకభాగంలో ఉన్న డబ్బా రేకును కట్‌చేసి షాపులోకి ప్రవేశించి సెల్‌ఫోన్లు, ఇయర్‌ఫోన్స్, టెంపరి గ్లాసులు, చార్జర్లు, పెన్‌డ్రైవ్‌లతో పాటు పలు సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. తన పక్క షాపు యజమాని సుదర్శన్ మా తమ్ముడికి ఫోన్‌చేసి డబ్బాను వెనుకవైపు గుర్తుతెలియని వ్యక్తులు కట్ చేశారని సమాచారం ఇవ్వడంతో వచ్చి చూసినట్లు నరేష్ తెలిపారు. చోరీకి గురైన సామగ్రి విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని, తమకు న్యాయం చేయాలని కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

గొర్రెల దొంగతనం: కేసు నమోదు

ఊర్కొండ, జనవరి 14: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామంలో గొర్రెల దొంగతనం జరిగిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై లెనిన్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. రేవల్లి గ్రామానికి చెందిన బత్తుల సురేష్ తన గొర్రెల మందను గురువారం రాత్రి ఇంటి ముందు ఉన్న దొడ్డిలో ఉంచి ఇంట్లో నిదురిస్తున్నాడన్నారు. గొర్రెల మంద నుంచి అలజడి వచ్చి చూడగా దొడ్డి ముందు నుంచి వాహనం వెళుతున్నది గమనించి వెంటనే దొడ్డిని పరిశీలించగా 8 గొర్రెలు లేవని శుక్రవారం పోలీసులు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లెనిన్ తెలిపారు.

ఉత్సాహంగా జాతీయ నెట్‌బాల్ టోర్నీ

- బోణీ కొట్టిన తెలంగాణ పురుషులు, మహిళల జట్లు

మహబూబ్‌నగర్, జనవరి 14 : జాతీయ నెట్‌బాల్ క్రీడలు ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగుతున్నాయి. క్రీడాకారులు గెలుపు కోసం హోరాహోరీగా తలపడుతుండటంతో రసవత్తరంగా మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఆదివారం తెలంగాణ పురుషుల జట్టు విజయంతో బోణీ కొట్టింది. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో రెండ్రోజులుగా జాతీయ నెట్‌బాల్ క్రీడలు జరుగుతున్నాయి. పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు ఉత్తరఖండ్‌పై 21-5 స్కోర్‌తో గెలిచి శుభారంభం చేసింది. అదేవిధంగా మహిళల విభాగంలో తెలంగాణ మహిళా జట్టు బెంగాల్‌పై 30-5 స్కోర్‌తో విజయం సాధించింది. అదేవిధంగా పురుషుల విభాగంలో కేరళ జట్టు తమిళనాడుపై 32-12 స్కోర్‌తో, ఛత్తీస్‌ఘడ్ బీహార్‌పై 25-22 స్కోర్‌తో, కర్ణాటక జట్టు మహారాష్ట్రపై 31-14 స్కోర్‌తో, గోవా జట్టు పుదుచ్చేరిపై 27-15 స్కోర్‌తో, ఉత్తరఖండ్ మధ్యప్రదేశ్‌పై 30-13 స్కోర్‌తో, హర్యాన ఆంధ్రప్రదేశ్‌పై 44-22 స్కోర్‌తో, జమ్ముకాశ్మీర్ తమిళనాడుపై 24-10 స్కోర్‌తో, ఆంధ్రప్రదేశ్ జట్టు బెంగాల్‌పై 28-14 స్కోర్‌తో విజయం సాధించాయి. అదేవిధంగా మహిళల విభాగంలో తమిళనాడు జట్టు పుదుచ్చేరిపై 25-18 స్కోర్‌తో, కర్నాటక జట్టు మహారాష్ట్రపై 20-12తో, బీహార్ జట్టు ఆంధ్రప్రదేశ్‌పై 29-11తో, డిల్లీ జట్టురాజస్థాన్‌పై 14-10తో, హిమాచల్‌ప్రదేశ్ జట్టుబీహార్‌పై 22-16తో, పంజాబ్ జట్టు ఉత్తరప్రదేశ్‌పై 19-14తో, కేరళ జట్టు మధ్యప్రదేశ్‌పై 31-05తో, రాజస్థాన్ జట్టు తమిళనాడుపై 22-21 స్కోర్‌తో విజయం సాధించాయి. పటు జట్ల మధ్య టఫ్ ఫైట్ నడిచింది.


తలపడుతున్న తెలంగాణ-ఉత్తరఖండ్ జట్లు


తెలంగాణ- బెంగాల్ జట్ల క్రీడాకారులు

పట్టుదల, క్రమశిక్షణతోనే విజయాలు

నెట్‌బాల్‌ఎంపైర్ బోర్డ్ ఛైర్మన్ అశోక్‌ఆనంద్ క్రీడాకారుల మధ్య పోటీ ఉండాలని, కానీ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని నెట్‌బాల్‌ఎంపైర్ బోర్డ్ ఛైర్మన్ అశోక్‌ఆనంద్ అన్నారు. పట్టుదలతోపాటు క్రమశిక్షణ ఉంటేనే విజయాలు సాధిస్తారని చెప్పారు. ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. జాతీయస్థాయిలో క్రీడలు ఆడుతున్నారంటూ క్రీడాకారులలో ప్రతిభ ఉందని, ఈ ప్రతిభతోపాటు సత్తాను చాటాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. క్రీడాకారులు క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని, ప్రతిభను చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెట్‌బాల్ ఛైర్మన్ అమిత్‌అరోర, కన్వీనర్ ఆకాశ్‌బత్ర, నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, సాదత్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా నరసింహుడి కల్యాణం

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు


స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

తిమ్మాజిపేట, జనవరి 14 : తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం కమనీయంగా నిర్వహించిన నరసింహుడి కల్యాణోత్సవంలో పాల్గొన్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, సరిత దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. అనంతరం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి ఆశీస్సులు పొందారు. ఆలయ ఆవరణలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కాలినడకన వచ్చే భక్తులకు హైదరాబాద్‌కు చెందిన లోటస్ ల్యాంప్ స్కూల్ అధినేత మంజుల శ్రీనివాస్‌రెడ్డి 13లక్షల వ్యయంతో నిర్మించిన మెట్ల దారిని, అదేవిధంగా వాహనాలు కిందికి దిగేందుకు వీలుగా కొడుపర్తి గ్రామానికి చెందిన చిలుక కృష్ణారెడ్డి జ్ఞాపకార్థమై కుమారులు, ఆలయ ధర్మకర్తలు చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డిలు 81లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రోడ్డు మార్గాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్త చిలుక సురేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు జల్లి తిరుపతమ్మ, ఉమాదేవిలు ఆలయ కమిటీ సభ్యులు చిలుక భాస్కర్‌రెడ్డి, నరసింహారావు, రామచంద్రారెడ్డి, రాందేవ్‌రెడ్డి, బాలస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చిలుక ఎల్లారెడ్డి, రమేష్, ఎల్లయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుందరయ్యలు శాలువాలు కప్పి పురోహితులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కర్నాటి మమత బాపురెడ్డి నిత్య పూజ నిధిపై తనవంతుగా లక్షా 116రూపాయలు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఉమ్మడి జిల్లాలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు కనుల పండువగా నిర్వహించిన కల్యాణాన్ని వీక్షించి తరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తూ అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతితో పాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

● టీజేఎస్ జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్‌గౌడ్


రాష్ట్ర సదస్సు పోస్టర్లను విడుదల చేస్తున్న టీజేఎస్ నాయకులు

గద్వాల టౌన్, జనవరి 14 : కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా, విభజన సమస్యల పరిష్కారం కోసం కేంద్రంపై ఒత్తిడి ప్రధాన ఎజెండాగా ఈ నెల 21న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్‌గౌడ్ కోరారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ఖైరతాబాద్‌లోని మోక్షగుండ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆచార్య కోదండరాం అధ్యక్షతన సదస్సు ప్రారంభమవుతుందన్నారు. విభజన నిబంధన మేరకు ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన ఉద్యోగులను రప్పించడం, రాష్ట్రస్థాయి సంస్థల ఆస్తుల విభజన, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజాపేట రైల్వేకోచ్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు తదితర అంశాలపై సదస్సులో విస్తృత చర్చ ఉంటుందన్నారు. సదస్సుకు జిల్లా నుంచి విద్యావంతులు, మేధావులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమ జేఏసీ నాయకుడు ఆర్. రామ్మోహన్, టీజేఎస్ నాయకులు వీరభద్రప్ప, మహబూబ్‌బాషా, మధు, రాజు, ఇస్మాయిల్ ఉన్నారు.

ప్రమాదపు అంచున వాటర్ ట్యాంక్

చిన్నంబావి, జనవరి 14: చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామంలో వాటర్ ట్యాంకు ప్రమాదకరంగా మారింది. పెచ్చులు ఊడిపోయి ఇనుప చువ్వలు తేలి ఉండటంతో వాటర్ ట్యాంకు వద్దకు నీటి కోసం వెళ్లాలంటే జనం భయాందోళన చెందుతున్నారు. కొంతకాలంగా వాటర్ ట్యాంక్ పరిస్థితిపై స్థానిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాణాప్రాయం జరుగకముందే అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ట్యాంకును కూల్చి నూతన ట్యాంకును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన వాటర్ ట్యాంక్

శివాంజనేయస్వామి ఆలయంలో పూజలు


విద్యుత్ దీపాలతో ముస్తాబైన శివాంజనేయస్వామి ఆలయం


శివాంజనేయస్వామి జాతర సందర్భంగా భజన పోటీలు

ఇటిక్యాల, జనవరి 14: ఇటిక్యాల మండల పరిధిలోని వావిలాల గ్రామంలోని శివాంజనేయస్వామి జాతర వైభవంగా కొనసాగుతోంది. ప్రధాన ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఆదివారం స్వామివారికి అభిషేకం, ఉపనయన పల్లకీ సేవ పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భజన పోటీలను మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మాసాని మాణిక్యారెడ్డి ప్రారంభించారు. పోటీలకు ఉమ్మడి జిల్లాతో పాటు ఆయా జిల్లాల నుంచి 17 భజన టీంలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే క్రికెట్ పోటీలకు 52 టీంలు వచ్చాయన్నారు. ఉత్సవాలు అయిదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు మృతి

- సర్జఖాన్‌పేటలో విషాదం

కోస్గి రూరల్, జనవరి 14 : కారు, ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండలం సర్జఖాన్‌పేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు సర్జఖాన్‌పేట గ్రామానికి చెందిన కార్తీక్‌గౌడ్(17) పొలం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తున్నాడు. కోస్గి వైపు నుంచి పరిగి వైపునకు కారులో వెళ్తున్న భరత్‌గౌడ్‌కు ఒక్కసారిగా పొలం వైపు నుంచి ద్విచక్ర వాహనంతో రోడ్డుపైకి బాలుడు రావడంతో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో కార్తీక్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉప్పునుంతల, జనవరి 14: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో పండగపూట విసాదం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సల్వాల చంద్రయ్య ఆదివారం ఉదయం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు వంట గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగడంతో చంద్రయ్య తోడ బాగం కాలి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. అదే విధంగా ఇంటి పైకప్పు రేకులు పగిలిపోయాయి. ఇంట్లో ఉన్న 5 వేల నగదుతో పాటు దుస్తులు, బియ్యం నిత్యావసర సరుకులు కాలిబూడిదైనట్లు బాధితుడు వాపోయాడు. దాదాపు 50 వేల వరకు నష్టం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. చంద్రయ్య కు భార్య కొంతకాలం కిత్రం మృతి చెందింది. కుమారుడు వేరు ఇంట్లో ఉంటున్నాడు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. చంద్రయ్యను చికిత్స కోసం అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు. బాధితునికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ లింగమయ్య కోరారు.



గాయాలైన చంద్రయ్య, మంటలకు కాలిపోయిన వస్తువులు

బైకు అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

తెలకపల్లి : ఒక వ్యక్తి అచ్చంపేట నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తుండగా మండల పరిధిలోని రాకొండ సమీపంలో బైకు అదుపు తప్పి రోడ్డు మీద పడిపోవడం జరిగింది. దీనికి సంబంధించి 108 సిబ్బంది ఎంటీ శ్రీకాంత్, పైలట్ రాముడు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం వేపూరి ధర్మయ్య అచ్చంపేట నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తుండగా రాకొండ సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడిపోవడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అతనికి ప్రథమ చికిత్స నిర్వహించి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్ల గ్రామానికి చెందిన వ్యక్తి ఇతని దగ్గర ఒక మొబైల్ ఫోన్, బైకు తాళం, నగదు 76,500రూపాయలు ఉన్నాయని అతని భార్యకు, డ్యూటీ డాక్టర్‌కు, పోలీస్ అధికారికి అప్పజెప్పడం జరిగిందని 108 సిబ్బంది తెలిపారు.

పందుల దొంగలు రిమాండ్

- ఊర్కొండ ఎస్సై లెనిన్

ఊర్కొండ, జనవరి 14: పందుల దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామ శివారులో గత నెల 28న పందుల దొంగతనం జరిగింది. పందుల యజమాని అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మక్కల నగేష్, మక్కల రాజు, మక్కల రజనీకాంత్‌లను గుర్తించి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మరో వ్యక్తి రాజేష్ పరారీలో ఉండగా, ముగ్గురు నిందితుల నుంచి 28 పందులను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

- కేసు నమోదు చేసిన ఎస్ఐ రవినాయక్

హన్వాడ, జనవరి 14 : చిన్నదర్పల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున చిన్నదర్పల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు చిన్నదర్పల్లి నుంచి జిల్లా కేంద్రానికి ఇసుకను తరలిస్తున్న సమాచారంతో అక్కడికి వెళ్లి పట్టుకున్నారు. ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే వారికి కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అలంపూర్ చౌరస్తా, జనవరి 14: జోగుళాంబ అమ్మవారి ఆలయాలను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తన అనుచరులతో కలిసి వచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ విశిష్టతను వివరించారు. అలాగే జోగుళాంబ అమ్మవారిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం దేబాష్‌మిత్ర, డీజీఎంలు ప్రశాంత్‌కుమార్ బోరియార్, వివేక్‌చంద్ర జైస్వాల్, ఆర్‌ఎం వెంకటనారాయణ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయానికి వాటర్ కూలర్, వీల్ ఛైర్లు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈవో పురేందర్‌కుమార్ తదితరులున్నారు.


అమ్మవారి ఆలయంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

యాసంగిలో జోరందుకున్న వరినాట్లు

- వరినారు, వెదజల్లే ప్రక్రియలో రైతాంగం


నాట్లు వేస్తున్న కూలీలు

నారాయణపేట, జనవరి 14 : నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సాగుపై అన్నదాతలు దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా వరి విత్తనాలు వెదజల్లుతుండగా ఇంకో పక్క వరినాట్లను వేస్తున్నారు. ఇప్పటికే బోర్ల కింద వరి నాడుమడులను తీస్తూ కరిగేటలో నాట్లు వేసే పనుల్లో రైతాంగం నిమగ్నమైంది. జిల్లాలోని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో రబీ వరిసాగుపై రైతులు అధికంగా దృష్టిని సారించారు. బోర్ల కింద కూడా రైతులు వరి నారుమళ్లను వేసేందుకు వరి విత్తనాలను మండకట్టి మొలకెత్తిన విత్తనాలను వెదజల్లుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తెల్లజొన్న, వేరుశనగ, పొద్దుతిరుగుడు, గుర్రంశనగ పంటలను సాగు చేశారు. తెల్లజొన్న 600 ఎకరాల్లో, వేరుశనగ పంటను 6,989 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత రబీలో వరి 1.20 లక్ష ఎకరాల్లో సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.


ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న డ్రైవర్

మత్తులో యువత భవిష్యత్తు చిత్తు

- గంజాయితో పాటు మత్తు ద్రావకాలను సేవిస్తున్న కళాశాల విద్యార్థులు
- మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత గాడిన పడేనా?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- పోలీసుల నిఘా వైఫల్యంతో రెచ్చిపోతున్న నిషారాయుళ్లు

కొల్లాపూర్, జనవరి 14: నిండా 18సంవత్సరాలు దాటని యువకులు మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొల్లాపూర్‌లో గడిచిన రెండు సంవత్సరాలుగా రోజురోజుకు మాదక ద్రవ్యాలను సేవించడంపై యువత, విద్యార్థులు ఆసక్తి చూపుతూ తమ నూరేళ్ల జీవితాన్ని చిత్తు చేసుకుంటున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే దట్టమైన నల్లమల అడవులకు ప్రసిద్ధిగాంచిన కొల్లాపూర్ మండలంలోని నల్లమల గ్రామాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా యువత, విద్యార్థులు గంజాయిని సేకరించి వాటిని సిగరెట్లలో నింపి మత్తులో కాలం వెల్లదీస్తున్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి నిషాలోకి వెళ్తూ గొడవలకు పాల్పడుతూ నానా బీభత్సం సృష్టిస్తున్నారని పట్టణ ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్న పోలీసుల నిఘా వైఫల్యంతో మత్తులో ఉన్న యువత మరింత రెచ్చిపోతున్నారు. మరికొంత మంది పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులు మరొక అడుగు ముందుకేసి బహిరంగ మార్కెట్‌లో దొరికే వైట్‌నర్, బోనోఫిట్స్ గమ్, ఫెవికాల్‌లతో పాటు టైర్లు పంక్చర్లు చేసే సల్యూషన్‌లను కొనుగోలు చేసి వాటిని ప్లాస్టిక్ కవర్లలో వేసి బాగా రుద్ది దానికి చిన్న మంట పెట్టి కవర్లను మూతికి పెట్టి వాటి నుంచి వచ్చే ఆవిరిని పీల్చుతూ యువత, విద్యార్థులు నిషాలోకి వెళ్తున్నారు.

నిత్యం పట్టణంలోని పలు ప్రదేశాల్లో బహిరంగంగానే ఈ తతంతగమంతా కొనసాగుతున్న అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల రహదారి, అమరగిరి రహ దారిలో, పట్టణంలోని చెరువు కట్టల మీద, పాడుబడ్డ బావుల వద్ద, జనం సంచరించిన ప్రదేశాలల్లో యువత, విద్యార్థులు గుంపు కట్టి తాము సేకరించిన మాదక ద్రవ్యాలను సేవిస్తూ నిషాలోకి వెళ్తున్నారు. నిషాలోకి వెళ్లిన యువత, విద్యార్థు లను అడ్డు చెప్పేందుకు వెళ్తున్న ప్రజలపై కూడా దాడులు చేసేందుకు వారు వెనుకాడడం లేదు. 20దాటని వయస్సులోనే మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన తమ పిల్లల జీవితాలు నాశనమవుతున్నాయని, వారి జీవితాలు ఎలా గాడినపడతాయని తల్లిదండ్రులు నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. కొల్లాపూర్ పట్టణంలో కూడా సాయంత్రం వేళల్లో మినీ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పరిసరాల్లో, చుక్కాయిపల్లి చెరువు కట్టపై, జమ్మిచెట్టు కోట బురుజు వెలుపల, సోమశిల రహదారి వెంట యువత బహిరంగంగానే మాదక ద్రవ్యాలను సేవిస్తున్న వారిని అరికట్టే వారు లేకపోవడంతో మాదక ద్రవ్యాలు సేవించిన యువత పోటీలు పడి పట్టణంలో బైక్ రైడింగ్ చేస్తూ ఇతరులను భయాభ్రాంతులకు గురి చేస్తున్నారని, వెంటనే ఇలాంటి వాటిని పోలీసులు అరికట్టాలని, యువత జీవితాలను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకొని

పరిష్కరించడమే ప్రజా పాలన



వడ్డెవాట నుంచి చర్లపల్లికి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట, జనవరి 14: ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా పాలన అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వడ్డెవాట, చర్లపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రజలకు స్వేచ్ఛ ఉండేది కాదని, అందుకోసమే ప్రజలు దొరల ప్రభుత్వానికి గడ్డి పెట్టి ప్రజా పాలనకు పట్టం కట్టరన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకం కావాలంటే పైరవీలు అవసరం లేదన్నారు. ప్రజలే నేరుగా వచ్చి విషయం చెపితే అధికారులతో నిర్వహించే గ్రామసభలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. మొన్న 6వ తేదీ వరకు ప్రభుత్వ పథకాలకు చేసుకున్న దరఖాస్తుల లబ్ధిదారులను ప్రజల సమక్షంలోనే ఎంపికలు ఉంటాయన్నారు. అంతకు ముందు వడ్డెవాట, చర్లపల్లి గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అయా కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్‌రెడ్డి నాయకులు యుగంధర్‌గౌడ్, ప్రశాంత్, జితేంద్రనాథ్‌రెడ్డి, గొల్లబాబు, బోయెజ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి న్యాయవాది కృష్ణ, రాంలాల్ నాయక్, బానుప్రకాష్‌రెడ్డి, మండ్ల రాములు, నారాయణ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా

గోదాదేవి,రంగనాథుడి కల్యాణోత్సవం



శ్రీరంగనాథ ఆలయంలో శ్రీగోదాదేవి రంగనాథుని కల్యాణోత్సవం

శ్రీరంగాపూర్, జనవరి 14: శ్రీరంగనాథ ఆలయంలో సంక్రాంతి సందర్భంగా గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో జరిగింది. సంక్రాంతి పండుగకు ప్రతీ వైష్ణవ ఆలయంలో జరిగే విధంగా శ్రీరంగనాథ స్వామి ఆలయంలో కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు గోదా కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం భోగి సందర్భంగా రాష్ట్ర నలుమాలల నుంచి వాహనాలల్లో భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది.

హనుమాన్ నామస్మరణతో మార్మోగిన ఖిల్లా

ఖిల్లాఘణపురం, జనవరి 14: మండల కేంద్రంలోని బెస్తగిరి అంజనేయ స్వామి ఆలయ ఆవరణ హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. ఆదివారం వీరాంజనేయ స్వామి మాలధారణ స్వాముల పడిపూజ, ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. మండల దీక్ష చేసిన స్వాములు ఇరుముడులతో అఖండ భజనలు చేస్తు గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. మాలధారణ స్వాములకు రమేష్ గురుస్వామి, అశోక్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం చేశారు. అనంతరం ఇరుముడులతో ఖిల్లాగట్టుపై వీరాంజనేయ స్వామి ఆలయానికి పయనమయ్యారు. ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి స్వామి వారికి నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఖిల్లా గట్టుపై వీరాంజనేయ స్వామి ఆలయానికి పాదయాత్రతో వెళ్లి రాత్రంతా భజనలు పురాణ కాలక్షేపాలతో స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఖిల్లాఘణపురంలో ఇరుముడులు ధరించిన వీరాంజనేయ స్వామి భక్తులు

పట్టణ అభివృద్దే లక్ష్యం

- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్



వెంగళరావు కాలనీలో భోగి మంటలు వేస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

వనపర్తి టౌన్, జనవరి 14: పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష ఐక్యవేదిక ముందుకు సాగుతోందని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు. ఆదివారం సంక్రాంతి సందర్భంగా వెంగళరావు నగర్, జంగిడిపురం కాలనీ ప్రజలతో కలిసి భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రత్యేక ప్రణాళికతో వెంగళరావు నగర్, జంగిడిపురం కాలనీల అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మురళీకృష్ణ, సంతోష్, శివకుమార్, ఉమాపతిగౌడ్, శివ, గోపాల్, సందానందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



పెబ్బేరు ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజ అనంతరం అక్షింతలు పంపిణీ చేసేందుకు వెళ్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

గోపాల్‌పేట, జనవరి 14: మండల కేంద్రంలో ఆదివారం అయోధ్య సీతారాముని అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అక్షింతలకు పూజ చేశారు. అనంతరం బీజేపీ నాయకులు, స్థానికులు భక్తి కీర్తనలతో ఊరేగించారు. అనంతరం ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పూజారులు రంగాచార్యులు మల్లికార్జున్, నాయకులు దిలీప్ , శివశంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో...

పెబ్బేరు : పెబ్బేరు పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం అయోధ్య అక్షింతలకు పూజ చేశారు. అనంతరం ఇంటింకి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, బీజేపీ, విశ్వ హిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కొత్తకోటలో...

కొత్తకోట : మండలంలోని పామాపురంలో అయోధ్య రామ మందిరం నుంచి తెచ్చిన అంక్షితలను భక్తులు ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. అంక్షితల పంపిణీకి ముందు అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వాసుదేవారెడ్డి, సుందర్‌రెడ్డి, సుధాకర్ చారి, రామచంద్రయ్య, కిషోర్‌రెడ్డి, బుచ్చన్న, బాస్కర్ చారి, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి

- క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 14: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సందడి మొదలైంది. మూడు రోజుల పాటు జరుపుకోనున్న ఉత్సవం కోసం ఇది వరకే ప్రజలు తమ సొంత ఇళ్లకు చేరుకున్నారు. గ్రామాల్లో పట్టణాల్లో కుటుంబ సభ్యులు బంధువులతో సందడి వాతావరణం ఏర్పడింది. తొలి రోజు భోగి సందర్భంగా ఉదయాన్నే ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి వాటి మధ్యలో గొబ్బెమ్మలను ఉంచారు. భోగి మంటలు వేశారు. నోరూరించే ప్రత్యేక పిండి వంటలు, సన్నాయి పాటలకు డూడూ బసవన్నల విన్యాసాలు పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. సంక్రాంతి సందర్భంగా ప్రతీ గ్రామం, పట్టణంలో యువత కోసం ఏర్పాటు చేసిన ఆటల పోటీలు ఆకట్టుకుంటున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా వనపర్తి పట్టణంలోని ఆదివారం దుకాణాల వద్ద చిన్నారులు గాలిపటాలు ఎగురవేయడానికి ఆసక్తి చూపారు. వారి కోసం వ్యాపారస్థులు విభిన్న రకాల గాలిపటాలను ఏర్పాటు చేశారు.

జిల్లా కేంద్రంలో..

భోగి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని న్యూ గంజ్ గణపతి దేవాలయం ఆవరణలో బాలాజీ సెలబ్రేషన్స్ టీమ్ వారు భోగి మంటలు వేశారు. రంగవల్లులను ఏర్పాటు చేసి మధ్యలో భోగిమంటలను వేశారు. అనంతరం భోగి, సంక్రాంతి, కనుమ పండుగల విశిష్టతను వారు తెలియజేశారు. కార్యక్రమంలో కటకం శ్రీధర్, కొండూరు వాసుదేవ్, ప్రసాద్, నరసింహ, శ్రీనివాసులు, గోకారం రాజు, బెల్లం రాజు, కె.భాస్కర్. వి.భాస్కర్, రాజేష్, పరమేశ్వర్, సాయి నారాయణ, సురేష్ బాబు,వెంకటరమణ, రాఘవేందర్ మహిళలు పాల్గొన్నారు.

గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట : మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 39 జంటలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి అరుణశ్రీ శ్రీలత, ద్వితీయ బహుమతి చంద్రకళ, శిరీషలు గెలుపొందారు. ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వారు రూ.3 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ మహిళకు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యురాలు కేతమ్మ, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కాశీనాథ్, మహిళలు ఉన్నారు.

శ్రీరంగాపురంలో..

శ్రీరంగాపూర్, పెబ్బేరు రూరల్ : శ్రీరంగాపురం, పెబ్బేరు మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఆదివారం సంక్రాంతి పండుగ జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున ఆడ పడుచులు రంగురంగులతో ముగ్గులను వేశారు. ప్రతీ ఇంటిలో ఆడపడుచులు, బంధువుల సందడి కనిపించింది. సంక్రాంతి సందర్భంగా యువకులు కబడ్డీ, క్రికెట్ పోటీలను నిర్వహించారు. సంక్రాంతి భోగి పండుగ సందర్భంగా నువ్వులతో రొట్టెలు తయారు చేశారు.

కొత్తకోటలో..

కొత్తకోట : మండలంలోని గ్రామాల్లో ప్రజలు భోగి సంబురాలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే భోగి మంటలతో చలి కాచుకున్నారు. మహిళలు వాకిళ్లను రంగవల్లులతో అలంకరించి గొబ్బెమ్మలను పేర్చారు. గ్రామాల్లో వ్యవసాయంలో సగభాగమైన ఎద్దులను చెరువుల వద్దకు తీసుకెళ్లి స్నానాలు చేయించి కొమ్ములకు రంగులు అద్ది రైతులు సంబురపడ్డారు. యువకులు, చిన్నారులు గాలి పటాలు ఏగుర వేశారు. అదేవిధంగా మండలంలోని రామకృష్ణాపూర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో మహిళలు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : సంక్రాంతి పండుగ సంబరాలను ఆత్మకూరు, అమరచింత మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఆయా పార్టీల నాయకులు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లకు నగదు, షీల్డు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పెబ్బేరులో..

పెబ్బేరు: సంక్రాంతి సందర్భంగా ఆదివారం పెబ్బేరు పట్టణంలోని మార్కెట్‌యార్డులో మాజీ సర్పంచు అక్కి సుశీల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై స్థానిక నాయకులతో కలిసి ముగ్గులు పరిశీలించారు. ఈ ముగ్గుల్లో ప్రథమ స్థానంలో సుమిత్ర, చంద్రకళ, ద్వితీయ స్థానంలో నిహారిక, కావ్య తృతీయ స్థానంలో మణెమ్మ, రాధ నిలిచారు. వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా బహమ తులు ప్రదానం చేశారు. అదువిధంగా మండల కేంద్రంలో ఘనంగా భోగి మంటలు వేసి సంబురాలు చేసుకున్నారు. మహిళలు వాకిళ్లలో రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి పూజ చేశారు. పట్టణంలో గంగిరెద్దుల ఆటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రాములు, వెంకటేష్‌సాగర్, గంధం రాజు, దయాకర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, జగదీష్ రెడ్డి, రాములుయాదవ్, సురేందర్‌గౌడ్ ఉన్నారు.



వనపర్తిలోని న్యూ గంజ్ గణపతి ఆలయ ఆవరణలో భోగి మంటలు వేస్తున్న మహిళలు



శ్రీరంగాపురంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



వనపర్తిలో గాలిపటాలు కొంటున్న చిన్నారులు



వనపర్తి పట్టణంలోని ఓ దుకాణం వద్ద రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

వేరుశనగ చివరి తడికి నీరందించాలి : మంత్రి జూపల్లి



రామన్‌పాడు ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి జూపల్లి

చిన్నంబావి, జనవరి 14: రామన్ పాడు ప్రాజెక్టు ద్వారా రైతులు సాగు చేసిన వేరుశనగ, మినుము పంటలకు అవసరమైన చివరి తడికి నీరందించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పంటకు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, కనీసం చివరి తడికైనా నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం మంత్రి జూపల్లి రామన్ పాడు ప్రాజెక్టును సందర్శించారు. జలాశయంలో నీటి లభ్యతపై నీటి పారుదలశాఖ అధికారులను ఆరా తీశారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా, పంట చివరి తడికి సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూరాల నుంచి రామన్‌పాడు గోపాల్‌దిన్నె వరకు అమరచింత, ఆత్మకూరు, మదనాపురం, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపురం, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు లెఫ్ట్ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు సమకూరుతుందని, బీమా ఎత్తిపోతల పథకం ద్వారా కొత్తకోట, శ్రీరంగాపురం, వీపనగండ్ల, చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు సమకూరుతుందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రాజెక్టులో నీటి లభ్యత ఎక్కువగా ఉంది. దీంతో కనీసం చివరి తడికి నీరందించాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ పంట చివరి తడికి నీటిని విడుదల చేయాలని మంత్రి అధికారులను ఆదేశించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సత్యశీలారెడ్డి, చిన్నంబావి మండల ప్రజాప్రతినిధులు కొత్త కళ్యాణ్ కుమార్, మండడి చిదంబర్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, ఈదన్న యాదవ్, వడ్డెమాన్ బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు మానుకొని అభివృద్ధిపై దృష్టి సారించండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

పెబ్బేరు, జనవరి 14:పెబ్బేరు పురపాలక వర్గం కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయడం మానుకొని పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఆదివారం మార్కెట్ యార్డులో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొన్నటి కౌన్సిల్ సమావేశానికి కాంగ్రెస్ నాయకులు అడ్డు తగిలారని విమర్శించడం సరైనది కాదన్నారు. కౌన్సిల్‌లో సంత స్థలం గురించి ఎమ్మెల్యే మేఘారెడ్డికి కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వస్తే నిందలు వేయడం పురపాలక వర్గం మానుకోవాలని అన్నారు. రోడ్ల విస్తరణ పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని వాటి పనులను పురపాలక వర్గం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెబ్బేరుకు ఆదాయాన్నిచ్చే సంత స్థలం గురించి పదే పదే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి 16ఎకరాల స్థలం కేటాయించారని పాలకవర్గం చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 30-19 గుంటల భూమి సంతకు చెందాలని అందుకు పురపాలక వర్గం తీర్మానం చేసి ఎమ్మెల్యే మేఘారెడ్డికి, కలెక్టర్‌కు ఇవ్వాలని మొత్తం స్థలం అన్యాక్రాంతం కాకుండా చూసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని వారన్నారు. సమావేశంలో కౌన్సిలర్ ఎల్లస్వామి, కాంగ్రెస్ నాయకులు దయాకర్‌రెడ్డి, రంజిత్‌కుమార్, ఎండీ షకీల్‌లు, యుగంధర్‌రెడ్డి, రాములుయాదవ్, శివసాయి, సర్వేశ్వర్, రాములు, సునీల్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్



ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు మెడికల్ కార్మికులు

ఆత్మకూరు, జనవరి14: ఆసుపత్రి కార్మికులకు చెల్లించాల్సిన ఐదు నెలల వేతనాలు సంక్రాంతి పండుగకు కూడా చెల్లించకపోవడం సిగ్గుచేటని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ ఆరోపించారు. ఆదివారం ఆత్మకూరు ఏరియా ఆసుపత్రిలో కాంట్రాక్టు కార్మికులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ వేతన బడ్జెట్ విడుదలకు సంబంధం లేకుండా ప్రతీనెల కార్మికులకు వేతనాలు అందిస్తామని అగ్రిమెంట్ చేసుకున్న ఏజెన్సీ ఐదు నెలలుగా చెల్లించకుంటే కార్మికుల జీవనం సాగేది ఎట్లా అని ప్రశ్నించారు. అనంతరం తెలంగాణ మెడికల్ వర్కర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం బ్రాంచ్ నూతన కమిటీని ఎంపిక చేశారు. గౌరవ ఉపాధ్యక్షుడిగా బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా చెన్నమ్మ, సహాయ కార్యదర్శిగా పార్వతమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా శ్రీకాంత్, కోశాధికారిగా నాగమ్మ, సలహాదారుడుగా భరత్‌తో పాటు మరో ఎనిమిది మందిని కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

మదనాపురం, జనవరి14 : మండలంలోని రామన్ పాడులో పారిశుధ్య కార్మికుడు కృష్ణయ్యకు విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక పోవడంతో అతను విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కురుమూర్తి స్వామి ఆలయ మాజీ చైర్మన్ మృతి

ఆత్మకూరు, జనవరి 14: కురుమూర్తి దేవస్థానం మాజీ చైర్మన్ హనుమంతరావు అనారోగ్య కారణంగా మృతి చెందినట్లు తిప్పడంపల్లి గ్రామస్థులు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యం కారణంగా ఉన్న హనుమంతరావు ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న సంస్థానాధీశులు రాజా శ్రీరామ్ భూపాల్ హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రహమతుల్లా తదితరులు ఉన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న బాల్యానాయక్

పాన్‌గల్, జనవరి 14: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్ అన్నారు. ఆదివారం మండల ంలోని తెల్లరాళ్లపల్లి తండాలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గామీణ ప్రాంతాలతో పాటు తండాల్లో క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. యువత చెడు మార్గం వెళ్లకుండా చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్మదా, యువజన సంఘం నాయకులు సోమ్లానాయక్, బాబు నాయక్, చిట్టెమ్మ, క్రీడాకారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్, జనవరి 14: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు మంజుల అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ఆదివారం మండలంలోని రేమద్దులలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ మేనేజర్ వెంకటరమణరెడ్డి, డాక్టర్ లారెన్స్, ఆరోగ్య విస్తరణ అధికారి కొండా శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, ఆరోగ్య మిత్ర గోవిందు, పంచాయతీ కార్యదర్శి సహదేవ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు నగదు, మెడల్స్ అందిస్తున్న గంధం బాలపీరు

వనపర్తి టౌన్, జనవరి 14: పట్టణంలోని గాంధీనగర్‌లో గంధం అంజనేయులు స్మారకార్థం నిర్వహించిన కబడ్డీ పోటీలు ఉత్సహంగా సాగా యి. రెండు రోజులుగా కర్రెమ్మగుడి ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌తో ముగిశాయి. ప్రథమ స్థానంలో కేజీఎఫ్ టీం, ద్వితీయ స్థానంలో ఈగల్స్ టీం, తృతీయ స్థానంలో చరణ్ టీంలు నిలిచాయి. ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టు సభ్యులకు నగదు పురస్కారంతో పాటు మెడల్స్‌ను గంధం బాలపీరు, టీచర్ అనసూయమ్మలు ప్రదానం చేశారు. తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు మెమొంటో అందించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గంధం నాగరాజు, దళిత అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షుడు ద్యారపోగు రవిప్రసాద్, రాములు, డీ వెంకటేష్, ద్యారపోగు శేఖర్, హోటల్ కేశవులు, డీ గోవిందు, ఇంద్రనాగన్న, మదన్, డీ గట్టయ్య, సురేందర్, కొమ్ము నవీన్, గంధం శివ, గౌతం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్లలో..

వీపనగండ్ల : క్రీడల వల్ల మానసికోల్లాసం కలుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెంకట్రాజయ్య తెలిపారు. మండల ంలోని కల్వరాల గ్రామంలో ఆదివారం లిటిల్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, సుభాష్ చంద్రబోష్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్పూర్తితో ఆడాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతయ్య, వెంకటేష్, నరసింహ, పెంటయ్య, వెంకటస్వామి, అంజి, పెంటయ్య అఖిల్, కురుమయ్య, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

శాఖాపురంలో ..

పెబ్బేరు రూరల్ : మండలంలోని శాఖాపురంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కబడ్డీ పోటీలను సర్పంచు రవికుమార్‌యాదవ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బాలచందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం వస్తుందని, గ్రామీణ స్థాయిలో పూర్వకాలం నుంచి కబడ్డీ ఆటలు జరుగుతున్నాయన్నారు.

గెలుపొందిన వారికి సోమవారం బహుమతు లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్, నరేష్, సాయి, శంకర్, సత్య. రవి, తరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.